

# ప్రతిప్రశ్న

## ఎన్. కె. ఆర్. మూర్తి

'ఈ లెక్కన ఈమె సూర్యోదయం చూడదు' అనుకున్నాడు డాక్టర్ హరిశ్చంద్ర, కేసు షీటు చూసి. కేసు షీటు ఉన్న క్లిప్ బోర్డు గోడకు తగిలించి బెడ్ వైపు చూశాడు.

కమిలిపోయి కాంతిహీనమైన చర్మంతో కప్పబడిన ఎముకల గూడు. ఊపిరి తీస్తూందా, లేదా అని అనుమానం కలిగించేంత స్వల్పంగా పొత్తి కడుపు కదులుతూంది.

అర్థం కానట్లు హరిశ్చంద్ర ఆమె ముఖంలోకి చూశాడు.

మూసిన కళ్ళతో పక్కకు తిరిగి ఉన్న ఆమె ముఖం డాక్టరుకు తెలియకుండా ఏదో మర్మాన్ని కప్పి పుచుతూన్నట్లుంది.

నిట్టూర్చి వెనక్కు తిరిగాడు హరిశ్చంద్ర.

హాస్పిటల్ విడిచి ఇంట్లోకి వచ్చాడు.

డ్రాయింగ్ రూమ్ పక్కనున్న చిన్న బాల్కనీలోని పేము కుర్చీలో బరువైన శరీరాన్ని వాల్చాడు.

యాంత్రికంగా టీపాయ్ మీద ఉన్న సిగరెట్ టిన్ తీసి సిగరెట్ ముట్టించాడు. అలుముకుంటూన్న సిగరెట్ పొగలా ఏదో చికాకు మనసులో ఆవరిస్తూంది. నాగమణి శుష్క శరీరం కళ్ల ముందు నిలబడుతూంది.

డాక్టర్ హరిశ్చంద్ర ప్రాణం నిలుపలేకపోయిన కేసుల్లో ఇది మొదటిది కాదు. తన హాస్పిటల్ గోడల మధ్య ఎంతమంది చివరి ఊపిరి పీల్చారో ఆయనకే తెలియదు. ప్రాక్టీసు పెట్టినప్పుడు చెక్కిన శిల్పంలా, చక్కగా సౌష్టవంగా ఉన్న హరిశ్చంద్ర శరీరం పిప్పళ్ళ బస్తాలా ప్రస్తుతపు ఆకారం లోకి వచ్చే లోపలే ఆ స్థలంలో ఉన్న చిన్న పాత డాబా మాయమయి అందమైన, ఆధునాతనమైన చిన్న బంగళా, దాని వెనకాల అన్ని ఆధునిక పరికరాలతో నూటఏభై బెడ్స్ కల మొదటి తరగతి హాస్పిటల్‌గా మారింది. అదంతా హరిశ్చంద్ర హస్తవాసి. సిటీలో పేరెన్నికగన్న అయిదారుగురు డాక్టర్స్‌లో ఒకడుగా లెక్కపెట్టబడిన తరవాతకూడా చాలా మంది హరిశ్చంద్ర హాస్పిటల్‌లోంచి దారి లేని పట్టణానికి టిక్కెట్లు తీసుకున్నారు. అయితే, ఆ విషయం హరిశ్చంద్రకుకూడా ఎప్పుడూ మనసులో ఉంటుంది. అయినా, ఆ సంఘటనలు ఆయనను అంతగా బాధించలేదు. ఆ ఓటమిని హరిశ్చంద్ర ఎప్పుడూ తన ఓటమిగా భావించలేదు. నిజానికి ఆ ఓటమి ఆయనది కాదు. ఆ ఓటమి ఈ నాడు ఇంతవరకూ పురోగమించి నిలిచిపోయిన వైద్య శాస్త్రానిది. ఆయన నేర్చిన వైద్యపు సరిహద్దులలో నిలబడగలిగినంతవరకు ఆయన రోగాన్ని ముదరనివ్వలేదు. ఎప్పుడు రోగి సరిహద్దులు దాటుతున్నాడో అదికూడా ఆయనకు తెలుసు. అటువంటి పరిస్థితుల్లో ఒక నిట్టూర్పు విడవడం తప్ప ఏమీ చేయలేకపోయాడు. ఇక ఆయన చేయగలిగిందల్లా రోజు రోజూ విదేశాల్లో ఇంకా అనుకూలమైన వాతావరణంలో పరిశోధనలు చేస్తున్న వైద్యశాస్త్ర నిపుణుల పరిశోధనలను మననం చేసుకుంటూ వీలయినంత వరకు తన వైపుణ్యాన్ని మెరుగు పెట్టుకోవడమే. నిజానికి ఆయన చేసిన ఆ పరిశ్రమే కొత్తగా విదేశాల నుంచి తర్ఫీదై వచ్చి భారీ ఎత్తున ప్రాక్టీసు పెట్టిన యువక డాక్టర్ల పోటీకి నిలబడే శక్తిని చాలా వరకూ ఇచ్చింది.

కాని, నాగమణి కేసు ఆయన ఆత్మ విశ్వాసానికి ఒక క్వెశ్చన్ మార్కులా నిలబడింది. ఆ మాట కొస్తే ఈ నాటి వైద్యానికే ఒక సవాలుగా మారింది. క్రిందటి మూడు నెలలుగా ఆమె శరీరం మీద వాడిన మందులు, వైద్య పద్ధతులు ఏమీ ప్రభావం చూపించకపోవడం డాక్టర్ హరిశ్చంద్రను చెప్పులో రాయిలా, కంటిలో నలుసులా బాధ పెడుతూంది.

ఉదయం నించి ఆమెకు స్పృహ లేదు. ఇది ఇప్పటివరకు ఆమెకు వచ్చిన ఫిట్సులో పొడవైనది. స్వల్పంగా నోట్లోంచి నురుగులు వస్తున్నాయి. నాడి చాలా బలహీనంగా ఉంది. క్షణక్షణం ఇంకా దిగబడి పోతూంది. ఈ లెక్కన ఇంకొక రెండు లేక మూడు గంటలు. . . డాక్టర్ హరిశ్చంద్ర మొదటి ఓటమి నిజం కాబోతూంది. ఆమెను గురించి గమ్యం లేని ఆలోచనలు ఈగల్లా ముసురుతున్నాయి. ఒక వైద్యుడుగా తనుడామెకు ఏం చెయ్యాలో అర్థం కావటం లేదు.

నాగమణిని గురించి మొదటిసారిగా హరిశ్చంద్ర మూడు సంవత్సరాల క్రితం విన్నాడు.

ఒక రోజు సాయంత్రం ఆర్కిటెక్ట్ రాజారావు తనకు దొరికిన పదహారు అంతస్తుల బిల్డింగ్ కాంట్రాక్టు సందర్భంలో ఇచ్చిన పార్టీలో ఏదో మాటల మధ్య ఆమె ప్రస్తావన వచ్చింది.

నాగమణి రాజారావు ఫర్మ్‌లో అప్పుడు కొత్తగా చేరిన ఇంజనీరు సాంబశివం భార్య. ఆ రోజు రాజారావు ఆమెను గురించి ఒక జానపద సినిమా కథలా చెప్పాడు.

నాగమణి పుట్టగానే ఆమె తల్లి పాము కాటు వలన మరణించింది. నాగమణి లేత పాదం మీదకూడా పాము కాటు కనబడింది. మూడు,నాలుగు రోజులు పిల్ల బతుకుతుందనే ఆశ వదులుకున్నారు. కాని, నాగమణి బతికింది. నాగుల సంబంధమైన మరే ఆపదా రాకూడదని మొక్కుకుని ఆమె కా పేరు పెట్టుకున్నారు పెద్దవాళ్ళు.

ఆమె పుట్టినప్పటి నుంచీ అడపాతడపా ఆ ఇంట్లో పాము కనబడుతూనే ఉంది.

ప్రతి ఏడాది నాగుల చవితికి రెండు, మూడు రోజులు నాగమణి జబ్బు పడుతూండేది. తరవాత మామూలు మనిషయ్యేది. అయిదారేళ్ళ తరవాత ఒకసారి ఇలా నాగమణి జబ్బు పడినప్పుడు చూస్తే ఆమె కాలిమీద దగ్గర దగ్గరగా రెండు సూదులతో పొడిచినట్లు గాయం ఉంది. అదేమైనా పాము కాటు లాంటిదా అనే అనుమానం ఇంట్లోవాళ్ళకు వచ్చింది కానీ, వేరే దృష్టాంతం లేకపోవడం మూలాన మరిచిపోయారు.

తరవాత సంవత్సరం నాగుల చవితికి పుట్టలో పాలు పోసేందుకు నాగమణి మేనత్తతో పాముల పుట్టకు ఊరి బయటకు వెళ్ళింది.

పూజ చేసి, పాలు గిన్నెలో పోసి మేనత్త ఒక్క క్షణం కళ్ళు మూసి తెరిచేసరికి ఆమె ఆశ్చర్యానికి అంతు లేకపోయింది.

పుట్టలోంచి మిసమిస లాడే నల్లత్రాచు పడగెత్తి ఆడుతూంది.

తరవాత నాగమణి సంతోషంతో పాము పడగను చేతితో తాకబోవడం, పాము ఆమె చేతిని పడగతో కొట్టి పుట్టలోకి జారిపోవడం ఒక్క క్షణంలో జరిగిపోయాయి. మేనత్త కెవ్వున కేక పెట్టింది. నాగమణి బాధతో గిలగిల లాడుతూంది. ఇంటికి తీసుకొచ్చి చేతనైన వైద్యాలన్నీ చేయించారు. నాలుగు రోజుల తరవాత నాగమణి శరీరం మీద పాము కాటు జాడలేదు, చిన్న మచ్చ తప్ప.

ఇంట్లో మనుష్యులు చూసో,చూడకో ఇది ప్రతి సంవత్సరం జరుగుతూనే ఉంది. అన్నిటికంటె విచిత్రమైన విషయం ఏమిటంటే, ఆ రోజు వచ్చేసరికి నాగమణి చాలా ఆందోళనగా ఉంటుంది. ఆకలితో నకనక లాడే మనిషిలా, ఊపిరి సలపనట్లుగా కాలు కాలిన పిల్లిలా తిరుగుతుంది. పాము కంటబడేసరికి ఉత్తేజిత మవుతుంది. దాన్ని తాకడానికి, దానితో ఆడడానికి ఉత్సాహంతో ముందుకు దూకుతుంది.

ఒకసారి. . . అప్పటికి నాగమణి పన్నెండేళ్ళ పిల్ల. నాగుల చవితి వెళ్ళి రెండు రోజులయింది. ఆ సంవత్సరం ఇంట్లో వాళ్ళు ఒకళ్ళ తరవాత ఒకళ్ళు కళ్ళలో వత్తులు పెట్టుకొని నాగమణికి కాపలా కాశారు. పాము రాకుండా ఉండడానికి ఎన్ని చెయ్యాలో అన్నీ చేశారు. ఆ రెండు రోజులూ పాము ఎవరికీ కనబడలేదు. దానితో అందరికీ కొంత ధైర్యం కలిగింది. వీలయినన్ని జాగ్రత్తలూ తీసుకుని రెండవ రోజు రాత్రి అందరూ పడుకున్నారు. నాగమణి తండ్రికి తెల్లవారగట్ల అయిదుగంటలకు మెలకువ వచ్చింది. క్రిందటి రెండు మూడు రోజులుగా తీసుకున్న జాగ్రత్త ఆ రాత్రే సడలించడం వలన ఆయనకు నాగమణిని ఓ సారి చూడాలన్న ఆత్రత కలిగింది. వెంటనే లేచి పక్క గది తలుపు తెరిచాడు. ఆయన ప్రాణాలు పైనే పోయాయి. నల్లని త్రాచు నాగమణి మెడ చుట్టుకుని పడగెత్తి ఆడుతూంది . . . ఆయనకు కేక వెయ్యడానికి గొంతుకూడా పెగల్లేదు. తడబడుతూన్న మనసుతో,

మెడిసిన్ గురించి మాట్లాడిన మాటలు హరిశ్చంద్రకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించేవి. అది వృత్తిగా పెట్టుకున్న డాక్టర్లు కూడా అంతవరకూ విషయాలు తెలుసుకోరు. కాని, ప్రయోజనం ఏమిటి? వీటన్నిటితో చివరకు అతను తామరాకు మీద నీటి బొట్టు. ఆ మేధతో ఏ ఒక్క దానికి అంటి పెట్టుకున్నా, అద్భుతంగా రాణించే వాడు. అందుకే హరిశ్చంద్రకు అతనంటే సానుభూతి.

ఇద్దరూ కూర్చున్నా రంటే గుర్రా లెక్కుతారు.

అర్థం లేని సంఘం నీతి సూత్రాలను తునా తునకలు చేస్తున్నానని చింతామణి అనుకుంటాడు. తను డాక్టర్ కనక ఇటువంటి అనారోగ్యకరమైన అలవాట్ల చెడ్డ ఫలితాల నుంచి తాను ఏ క్షణంలో అయినా తప్పించుకోగల ననే ధీమా హరిశ్చంద్ర అంతరాంతరాల్లో ఎక్కడో ఉంది. ఫలితం—హరిశ్చంద్ర చేతి మీద పని లేనప్పుడు చింతామణి వస్తే ఇద్దరూ రెండు మూడు గంటలు కూర్చుంటారు. చివరకు చింతామణిని డ్రైవరు కారులో తీసుకుని వెళ్ళి ఇంట్లో దిగబెడతాడు.

హరిశ్చంద్రకు ఇల్లాలు ఆ సోఫాలోనే దుప్పటి కప్పుతుంది.

హరిశ్చంద్ర అలిసిపోయిన మనస్సుకు ప్రస్తుతం చింతామణి దేవుడులా కనిపిస్తాడు.

ఎక్కువ ఆముదం రాసి బలవంతంగా వంచిన సగం నెరిసిన జుట్టుతో చింతామణి తల ముళ్ళ పందిలా ఉంది. గుబురుగా, రెల్లు పొదల్లా ఎదిగిన కనుబొమలు. లోతైన కళ్ళు. తన పొడవు కొంచెం తగ్గించాలని వంగినట్లు కొంచెం గూను.

"ఖాళీగా కూర్చున్నావే! ఏ ఆపరేషన్ థియేటర్‌లోనైనా ఉంటా వేమోనని భయపడ్డాను." వస్తూనే ఓ సిగరెట్ ముట్టించి కుర్చీ లాక్కుని కూర్చున్నాడు.

హరిశ్చంద్ర సమాధానంగా చిరునవ్వు నవ్వాడు.

పిచ్చాపాటీ మొదలయింది. మరో అర గంటకు యాథాలాపంగా అటు వచ్చి తెర తప్పించి వచ్చిన శ్రీమతి నిర్మలా హరిశ్చంద్ర భర్త కనుసైగ తెలుసుకుని మరో పది నిమిషాల్లో కావలసిన పదార్థాలన్నీ పంపించింది.

"ఏమిటి ఇంత లావు శరీరాన్ని విడిచి మనసు ఎక్కడికో పోయినట్లుందే!" అన్నాడు చింతామణి.

హరిశ్చంద్ర నవ్వి, పూర్తిగా ఈ ప్రపంచంలోకి రావడానికి ప్రయత్నించాడు. ఒకసారి చింతామణి వాగ్ధోరణి ఝంఝామారుతంలా ప్రపంచంలో అన్ని విషయాలూ చుట్టి వచ్చింది. భూమ్యా కర్షణ శక్తికి దూర మవుతూన్న రాకెట్‌లా మెదడు వేగాన్ని పుంజుకుంది.

రెండు గంట లయ్యేసరికి అతని నాలుకకూ, మెదడుకూ కనెక్షన్ తెగిపోయింది. ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు.

ఇది హరిశ్చంద్రకు అలవాటే. కానీ, ఈ రోజు చింతామణికి సరిగా కంపెనీ ఇవ్వలేక పోయాడు. నాగమణి కేసు మనసులో ముల్లులా కదులుతూంది. చివరకు బయటికి ఆలోచిస్తున్నట్లుగా పైకి అనేశాడు.

"ఏమిటి ఆవిడకు రోగం?" గ్లాసు టీపాయ్ మీద పెడుతున్నా ననుకొని కిందకు వదలబోతూంటే, చింతామణి చేతిలో గ్లాసు హరిశ్చంద్ర అందుకొని టీపాయ్‌మీద పెట్టాడు.

"అదే తెలియటం లేదు." చింతామణి పరిస్థితి తెలిసినా, మర్యాదకోసం చెప్పాడు హరిశ్చంద్ర.

"సింప్టమ్స్?" అక్కడ పడల్లేదు చింతామణి.

అయిష్టంగానే ఏకరువు పెట్టాడు హరిశ్చంద్ర.

"నీ కెక్కడయినా చిటికెడు విషం దొరికితే ఇంట్రావీనస్ ఇంజక్షను ఇయ్యి" అన్నాడు చింతామణి.

హరిశ్చంద్ర ఉలిక్కిపడి చూశాడు అతని వైపు. పాయలుగా చెదరిన జుట్టు నుదుటి మీదకు వ్రాలి కత్తుల్లాంటి నీడలతో కళ్ళు కప్పింది. చింతామణి స్పృహ తిన్నగా ఉండగా మాట్లాడిన మాటలు ఎప్పుడూ హరిశ్చంద్ర అంతగా లెక్క పెట్టుకోలేదు కానీ, ఇప్పుడు మత్తులో మాట్లాడిన మాటల్లో ఏదో కొంత అర్థం స్ఫురించింది. కాని, డాక్టరుగా అది అర్థం లేని పని.


చింతామణి లేవబోతూంటే హరిశ్చంద్ర డ్రైవరును పిలిచాడు. కారు స్టార్టు కాగానే హరిశ్చంద్రకు నాగమణిని చూడాలనిపించింది. వాచీ చూసుకున్నాడు.

**(ఒక యథార్థ సంఘటన ఆధారంగా)**

దాదాపు పదకొండున్నర అయింది. పెద్ద అంగలతో హాస్పిటల్లోకి నడిచాడు.

డ్యూటీలో ఉన్న నర్సు లేచి నిలబడింది ప్రశ్నార్థకంగా డాక్టర్ ముఖం లోకి చూస్తూ.

నాగమణి ఉన్న గది తెర తప్పించి లోపలకు వెళ్ళాడు హరిశ్చంద్ర. ఒక్కసారి హరిశ్చంద్రకు వెన్నులోంచి వణుకు పుట్టింది. గుండె గుభేలుమంది. కళ్ళు తిరిగి పడిపోతాడేమో ననే భయంతో తలుపు పట్టుకున్నాడు. ఎదురుగా కనీసం కన్నార్పనైనా ఆర్పకుండా చూశాడు.



పూవు — తావి
ఫోటో— టి. ఆర్. సుబ్రహ్మణ్యం (తిరుపతి)

నాగమణి బెడ్ మీద మిలమిలా మెరుస్తూ నల్లటి త్రాచుపాము. తెర తొలగించినప్పుడు అయిన ఇనుప రింగుల చప్పుడుకు ఒక్కసారి పడగెత్తి నాగమణి మెడ మీదకు ఒక్క విసురు విసిరింది. మరుక్షణంలో మంచం మీంచి నేల మీదకు దిగింది. నున్నటి నేల మీద అతి కష్టంతో గోడవరకూ పాకి, చూస్తూండగా కిటికీలోంచి మాయమయింది.

పాము వెళ్ళిన అయిదు నిమిషాలకు కాని హరిశ్చంద్ర తేరుకోలేదు. తరవాత నాగమణి దగ్గరగా వెళ్ళి చూస్తే మెడ మీద నల్లగా నెత్తురు పేరుకున్నట్లు సూది మొనల్లాంటి రెండు చుక్కలు ఉన్నాయి.

పదిహేను రోజుల తరవాత నాగమణిని డిస్చార్జి చేసే ముందు సాంబశివరావు కృతజ్ఞతతో హరిశ్చంద్రకు నమస్కరించాడు. నాగమణి చాలావరకూ కోలుకున్నా, ఇంకా చాలా నీరసంగా ఉంది. "మీ మేలు ఎప్పటికీ మరిచిపోలేం. ఎప్పటికీ మా ఆవిడకు మళ్ళీ ఈ వ్యాధి రాకుండా ఏ టానిక్కయినా ప్రిస్క్రైబ్ చెయ్యండి" అన్నాడు సాంబశివరావు.

హరిశ్చంద్ర భావయుక్తంగా నవ్వాడు. చివరకు ప్రిస్క్రిప్షన్ వ్రాసి సాంబశివరావు చేతిలో పెట్టాడు. అతను కాగితం తెరిచి చూశాడు.

"ఏడాది కో పాము కాటు."

తెల్లబోయి డాక్టర్ ముఖంలోకి చూశాడు.

"అవును, సాంబశివరావూ! నీ భార్య నా వైద్యం వల్ల కోలుకోలేదు. పదిహేను రోజుల క్రితం రాత్రి ఒక పాము వచ్చి ఆమెను మెడ మీద కాటు వేసింది. నేను ఒక వైద్యుడుగా చెప్పటం లేదు. అయినా, నా కనిపిస్తూంది, మనకు రోజుకు కొంత ఆహారం ఎలా అవసరమో, ఆమె శరీరానికి కొంత కాలాని కో సారి పాము కాటు అలా అవసరం. ఇందులో దృష్టం ఏమిటంటే, ఆమె వైద్యుడు ఆమెను వెదుక్కుంటూ వస్తున్నాడు. వాళ్ళిద్దర్నీ వేరు చేయడానికి ప్రయత్నించకు." *